క్లుప్తంగా

బడిబయటి పిల్లల గుర్తింపు

మాగనూర్: బడిబయట ఉన్న పిల్లలను బడిలో చేర్పించేందుకు తల్లిదండ్రులు సహకరించాలని నేరడగం కాంప్లెక్స్ సీఆర్పీ ఎల్లాగౌడ్ కోరారు. సోమవారం మండలంలోని వర్క్యూర్‌లో బడి ఈడు పిల్లల గుర్తింపు సర్వే చేపట్టారు. గ్రామాల్లో అనేక మంది పిల్లలు చదువుకు దూరంగా ఉన్నారని, పాఠశాలలు ప్రారంభం కాగానే తరగతుల్లో చేర్పిస్తామన్నారు. బడిఈడు పిల్లలను ఎవరైనా పనిలో పెట్టుకుంటే చట్ట రీత్యా శిక్షార్హులు అవుతారని హెచ్చరించారు.

బాల కార్మికులను పనిలో పెట్టుకుంటే చర్యలు

మరికల్: బాల కార్మికులను చదువుకు దూరం చేసి పనుల్లో పెట్టుకుంటే చట్ట పరమైన చర్యలు తీసుకుంటామని సీఆర్‌పీలు శివకుమార్, అరుణ అన్నారు. మండలంలోని కన్మనూర్ శివారులో సోమవారం ఇటుక బట్టీల వద్ద ఒడిశా వలస కార్మికుల పిల్లలను వారు గుర్తించారు. ఇక్కడ ఉన్న పిల్లల చదువు నిమిత్తం ఇక్కడే వారికి వర్క్ సైట్ స్కూల్ ఏర్పాటు చేసే విధంగా ఇటుక బట్టీల యాజమాన్యులు చర్యలు తీసుకోవాలన్నారు. 6 నుంచి 14 ఏళ్ల పిల్లల అందరూ బడిలో ఉండాలని వారి చదువుకి ఆటంకం కలిగించి ఎవరైనా పనుల్లో పెట్టుకుంటే బాల కార్మికులుగా పరిగణించి బాధ్యులపై చర్యలు తీసుకుంటామన్నారు.

హోలియ దాసరులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలి

మరికల్: ఆర్థికంగ చితికిన హోలియ దాసరులకు ప్రభుత్వం ఇళ్ల స్థలాలు ఇవ్వాలని బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు నారా కొండయ్య సోమవారం ప్రకటనలో తెలిపారు. హోలియ దాసరులకు ఇళ్ల స్థలాలు లేక గ్రామ శివారులో గుడిసెలు వేసుకొని జీవనం సాగిస్తున్నారని గుర్తు చేశారు. కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం గుర్తించి ఇళ్ల స్థలాలు ఇవ్వాలని ఆయన కోరారు.

ప్రభుత్వ పాఠశాలకు ఆర్థిక సాయం

నారాయణపేట రూరల్: మండలంలోని లక్ష్మీపూర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు ఎన్‌ఆర్‌ఐ ఆర్థిక సాయం అందించారు. పట్టణానికి చెందిన కల్యాణ్‌రాం ఉద్యోగ రీత్యా అమెరికాలో స్థిరపడ్డారు. ఆయన తల్లి వర్ధంతిని పురస్కరించుకుని రూ.10వేలను హెచ్‌ఎం యాద్గీర్ జనార్దన్‌రెడ్డి డబ్బులను పంపించారు. పాఠశాలకు ఉపయోగమైన వస్తువులను కొనుగోలు చేయనున్నట్లు హెచ్‌ఎం తెలిపారు.

బైండోవర్ చేసిన వ్యక్తికి జరిమానా

ధన్వాడ: ఎన్నికల సమయంలో బెల్టు షాపులో మద్యం అమ్మకూడదంటూ పలువురు బెల్టు షాపు నిర్వాహకులను స్థానిక పోలీసులు బైండోవర్ చేశారు. ఎన్నికల కోడ్ ఉన్న సమయంలో మండలంలోని చర్లపల్లికి చెందిన గొల్ల ఆంజనేయులు మద్యం అమ్మడంతో బైండోవర్ నిబంధనలు అతిక్రమించినందుకు ఆయనపై కేసు నమోదు చేశారు. అనంతరం తహసీల్దార్ సింధూజ ఎదుట హాజరు పరచగా ఆయనకు రూ.60వేల జరిమానా విధించినట్లు ఎస్‌ఐ రమేష్ తెలిపారు.

16 నుంచి ఉత్సవాలు



స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లా కేంద్రం సమీపంలోని పిల్లలమర్రిలో హజ్రత్ సయ్యద్‌షా కమాల్ హుస్సేనీ చిస్తీ, సయ్యద్ షా జమాల్ హుస్సేనీ చిస్తీ రొహెమతుల్లా అలై 648వ దర్గా ఉత్సవాలు ఈనెల 16 నుంచి ప్రారంభం కానున్నాయని ముతవల్లి షా మహ్మద్ ఫజల్‌ఖాన్ తెలిపారు. దర్గా ఆవరణలో ఉర్సు ఉత్సవాల పోస్టర్లను మౌలానా ఆలిండియా సున్నీ ఉల్మా మషాయక్ బోర్డు ప్రధాన కార్యదర్శి మొహసిన్‌పాష ఖాద్రీ, మౌలానా నాసిర్ మజహరి, పీఏసీఎస్ వైస్ చైర్మన్ బ్రహ్మయ్య ముఖ్య అతిథులుగా హాజరై ఆవిష్కరించారు. ముతవల్లీ మాట్లాడుతూ 16న గుసుల్‌షరీఫ్ (జలాభిషేకం), 17న గంథోత్సవం, చాదర్ల సమర్పణ, ప్రత్యేక ఫాతేహాలు, 18న ముగింపు సందర్భంగా దీపారాధన (చిరాగే) వేడుకలు ఉంటాయని తెలిపారు. ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌తోపాటు ఇతర ప్రజాప్రతినిధులు, మతపెద్దలు పాల్గొంటారని తెలిపారు. అష్వాక్, ఖాజా ఖాన్, ఎండి.జహంగీర్, అయూబ్‌పాష, ఎండి.యాసిర్, బిలాల్ తదితరులు పాల్గొన్నారు.

కార్తీకదీపోత్సవం

మద్దూరు: కార్తీక అమావాస్యను పురస్కరించుకుని మండలంలోని మద్దూరు, పెదిరిపాడ్, నాగిరెడ్డిపల్లి, భూనీడ్ తదితర గ్రామాల్లో ఆంజనేయస్వామి, శివాలయాల్లో దీపోత్సవాన్ని నిర్వహించారు. మహిళలు, భక్తులు దీపాలను వెలిగించారు.



ప్రతి పనికి ఓ రేటు

- కృష్ణ మండలంలో కాసులిస్తేనే ప్రభుత్వ కార్యాలయాల్లో పనులు
- ప్రభుత్వం మారడంతో ఇక్కడికి బదిలీ కోసం ప్రారంభమైన పైరవీలు
- సరిహద్దు మండలం అయినందున అడిగేవారు కరువు



కృష్ణా రైల్వేస్టేషన్

కృష్ణా: మక్తల్ నియోజకవర్గంలోని కృష్ణా మండలం విభిన్న సంస్కృతులకు, సాంప్రదాయాలకు నిదర్శనం. ఇక్కడి ప్రజలు, ప్రజాప్రతినిధులు సౌమ్యులు కావడంతో ఈ మండలంలో విధులు నిర్వహిస్తున్న అధికారులు ఏం చేసినా పట్టించుకునే వారు కరువయ్యారు. పైగా ఇక్కడి రాజకీయ నాయకులు కూడా మిన్నకుండిపోవడంతో అధికారుల అవినీతికి అడ్డూఅదుపు లేకుండా పోయింది. ఓ చిన్న పనికి కూడా ఎంతటి వారైనా సరే డబ్బులు ఇవ్వాల్సిందే. లేదంటే నెలల తరబడి కార్యాలయాల చుట్టూ ప్రజలు తిరగాల్సి వస్తుంది. ఈ అవినీతి అనేది ఒక్క శాఖకే పరిమితం కాలేదు. మండలంలోని అన్ని శాఖల్లో ఇదే పరిస్థితి నెలకొంది. పైగా అధికారులు కూడా ఎప్పుడు వస్తారో, పోతారో తెలియదు. ఈ మండలంపై జిల్లా ఉన్నతాధికారులు కూడా దృష్టి సారించడం లేదు. ఈ మండలంలో ఇసుక, మట్టి, ఒండ్రు మట్టి, ఇటుకల బట్టీలు, కర్ణాటక నుంచి అక్రమంగా పెట్రోల్, డీజిల్ విక్రయాలు, మట్కా, పేకాట, స్టోన్ క్రషర్లు, క్వారీలు, కర్ణాటక నుంచి అక్రమంగా మద్యం తీసుకురావడం ఇలా ఒక్కటి కాదు ఎక్కడా లేని అవినీతి ఇక్కడ ఉందని చెప్పొచ్చు. పైగా కార్యాలయాల్లో బర్త్, డెత్ ధ్రువ పత్రాలు, కల్యాణలక్ష్మి పథకానికి ఒక్కో ధర నిర్ణయించారు. ఈ విషయంపై జిల్లా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసిన చలనం లేదని ప్రజలు బాహాటంగానే విమర్శిస్తున్నారు.

పైరవీలు ప్రారంభించిన అధికారులు

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఈ మండలంలో విధులు నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు తమ పరిధిలో ఎవరికి వారు పైరవీలు ప్రారంభించుకున్నారు. ఏది ఏమైనా ఈ మండలంలో లభించే అవినీతి డబ్బు ఆ స్థాయిలో ఉంటుంది. గతంలో ఇక్కడ విధులు నిర్వహించిన అధికారులు అవినీతి డబ్బుతో చాలా మంది ఇక్కడ భూములు కొన్నారని మండల ప్రజలు అంటున్నారు. కృష్ణా మండలంలో దోచుకునేవాడికి దోచుకున్నంతా అనేవిధంగా తయారైంది. ప్రస్తుతం ప్రభుత్వం మారిన తర్వాతనైనా మండలంలో మార్పు వస్తుందా? అని ప్రజలు ఎదురు చూస్తున్నారు.

పెండింగ్ పనులపై దృష్టి సారించాలి

నారాయణపేట రూరల్: రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం ఏర్పాటు కావడంతో విద్యారంగ సమస్యల సాధనపై దృష్టి సారించాలని పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నర్సింహారెడ్డి, జనార్దన్‌రెడ్డి, లక్ష్మారెడ్డి ఎమ్మెల్యే పర్ణికారెడ్డిని కోరారు. నూతన ఎమ్మెల్యేగా ఎన్నికైన చిట్టెం పర్ణికారెడ్డిని సోమవారం సాయంత్రం కలిసి సన్మానం చేశారు. చాలా రోజులుగా పెండింగ్‌లో ఉన్న అపరిష్కృత పనులను తొందరలో పూర్తిచేసే విధంగా ప్రభుత్వానికి నివేదించాలని ఆమెను కోరారు. కార్యక్రమంలో రఘువీర్, జనార్దన్, సత్యనారాయణ, వాణిశ్రీ, జహిరోద్దీన్, వరలక్ష్మి, శ్రీనివాస్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు తెలియజేస్తున్న నాయకులు

జీఓ 69 అమలు చేసి వలసలు నివారించాలి

నారాయణపేట: నియోజకవర్గం నుంచి అత్యధికంగా ముంబై, పూనే, హైదరాబాద్ పట్టణాలకు వలస పోతున్నారని నారాయణపేట కొడంగల్ ఎత్తిపోతల పథకం జీఓ నంబర్ 69ను అమలు చేసి ఈ ప్రాంత ప్రజల వలసలు తగ్గించాలని ఎమ్మెల్యే పర్ణికారెడ్డికి సీపీఐ(ఎంఎల్ ప్రజాపంథా) ఆధ్వర్యంలో సోమవారం సీవీఆర్ భవన్‌లో సమస్యలతో కూడిన వినతిపత్రం అందజేశారు. అంతకుముందు ఎమ్మెల్యేగా ఎన్నికైన శుభసందర్భంగా పూలబొకె అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ ప్రాంతంలోనే జీవనోపాధి లభించేలా ప్రాజెక్టును చేపట్టాలని, వ్యవసాయ పొలాలకు నీళ్లు వచ్చే రకంగా ప్రయత్నం చేయాలని కోరారు. ఇందుకు ఎమ్మెల్యే స్పందిస్తూ నాలుగు సమస్యలు తప్పకుండా పరిష్కరం చేస్తానని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో రాము, కాశీనాథ్, యాదగిరి, సర్పంచ్ జయ, ఎంపీటీసీ సునీత, నాయకులు తదితరులు ఉన్నారు.

అర్హులందరికీ ఆరు గ్యారంటీలు అందజేస్తాం

దామరగిద్ద: కాంగ్రెస్ ప్రభుత్వ ఎన్నికల మేనిఫెస్టోలో చెప్పిన ఆరు గ్యారంటీల సంక్షేమ పథకాలను అర్హులందరికీ అందజేస్తామని ఎమ్మెల్యే పర్ణికారెడ్డి అన్నారు. ఎమ్మెల్యేగా గెలిపొంది మొదటి సారిగా ఆమె భర్త విశ్వజిత్‌రెడ్డితో కలిసి సోమవారం మండలంలోని మద్దెల్‌బీడ్ రామాలయం, ఊరడమ్మ, బాపన్‌పల్లి గజలమ్మ ఆలయాల్లో, క్యాతన్‌పల్లి వీరభద్రేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మండల సరిహద్దులోని కర్ణాటక రాష్ట్రం యానుగుంది సూర్యనంది క్షేత్రంలో మాత మాణికేశ్వరి, వేంకటేశ్వర శివాలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు.

శక్తిపీఠం స్వామీజీ ఆశీస్సులందుకున్న ఎమ్మెల్యే

నారాయణపేట: ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి సోమవారం జిల్లా కేంద్రంలోని శ్రీసంత్ మూల మహాసంస్థానం శక్తిపీఠంను దర్శించుకున్నారు. శక్తిపీఠం వ్యవస్థాపకులు పూజ్యశ్రీ స్వామి శాంతనందపురోహిత్ ఎమ్మెల్యేను ఆశీర్వదించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శక్తిపీఠంలో అమ్మవారికి 108 టెంకాయలను సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

నేడు దీపార్చన



అలంకరణలో ఉమామహేశ్వర ఆలయం

మక్తల్: పట్టణంలో ఉమామహేశ్వర ఆలయంలో మంగళవారం సాయంత్రం 6గంటలకు 33,333 దీపోత్సవ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆలయ పూజారి సిద్ధరామయ్య తెలిపారు. దీపోత్సవం సందర్భంగా ఆలయాన్ని అలంకరణ చేశారు. భక్తులందరూ పాల్గొని శివుడికి ప్రత్యేకంగా పూజలు చేసి మొక్కులు చెల్లించుకోవాలని కోరారు.

13న మండల సర్వసభ్య సమావేశం

నర్వ: మండల సర్వసభ్య సమావేశం 13న మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహిస్తున్నట్లు ఎంపీపీ జయరాములుశెట్టి తెలిపారు. బుధవారం మధ్యాహ్నం 2 గంటలకు నిర్వహించే సమావేశానికి ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి హాజరవుతున్నారన్నారు. అన్ని శాఖల అధికారులు, సభ్యులు హాజరుకావాలన్నారు.

పాఠశాల తనిఖీ



మాగనూర్: మండలంలోని వర్క్యూర్ ప్రాథమిక పాఠశాలను మండల నోడల్ అధికారి వెంకటయ్య సోమవారం తనిఖీ చేశారు. విద్యార్థులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు మెరుగైన విద్య అందించాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. సర్కార్ బడుల్లోనే సుశిక్షితులైన ఉపాధ్యాయులు ఉంటారన్నారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేసిన ఆయన మెనూ ప్రకారం నిర్వహించాలని సూచించారు.

అక్రమ కేసులను ఎత్తివేయండి

మక్తల్: ఇథనాల్ కంపెనీ నుంచి ప్రజలకు ఇబ్బందులు ఉన్నాయని ఉద్యమాలు చేపడితే పోలీసులు తమపై దాడి చేసి అక్రమంగా కేసులు పెట్టారని, వాటిని ఎత్తివేయాలని చిత్తనూర్ ఇథనల్ వ్యతిరేఖ పోరాట కమిటీ సోమవారం మక్తల్‌లో ఎమ్మెల్యే వాకిటి శ్రీహరికి వినతిపత్రం అందజేశారు. తమపై దాడి చేసిన డీఎస్పీ సత్యనారాయణ, మరికల్ ఎస్‌ఐ హరిప్రసాద్, మరికల్ సీఐ రాజేందర్‌లను వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. పోలీసులు తమను చిత్రహింసలు పెట్టి కొట్టారని వివరించారు. లేనిపోని కేసులను పెట్టి ఇబ్బందులకు గురి చేశారన్నారు. సమస్యను సీఎం రేవంత్‌రెడ్డితో చర్చించి పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని ఎమెల్యే హామీ ఇచ్చారు.



ఎమ్మెల్యే వాకిటి శ్రీహరికి వినతిపత్రం అందజేస్తున్న చిత్తనూర్ బాధితులు

పట్టణవాసుల ఫిర్యాదు

మక్తల్ పట్టణంలోని 7, 8వ వార్డులో రాత్రి వేళల్లో దొంగల భయం అధికంగా, పోలీసులు గస్తీ రావడం లేదని ఎమ్మెల్యేకు కాలనీ వాసులు ఫిర్యాదు చేశారు. ఈ విషయంపై ఎమ్మెల్యే మక్తల్ సీఐ రాంలాల్‌కు ఫోన్ చేసి రాత్రి వేళల్లో గస్తీ తిరిగాలని ఆదేశించారు.

ఎమ్మెల్యేకు సన్మానం

ఎమ్మెల్యే వాకిటి శ్రీహరిని మక్తల్ మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు ప్రతాప్‌రెడ్డి ఆధ్వర్యంలో శాలువతో ఘనంగా సన్మానించారు.

నర్వ: ఎమ్మెల్యే వాకిటి శ్రీహరిని కాంగ్రెస్ నాయకులు సత్కరించారు. మండలంలోని పెద్దకడ్మూర్‌లో పోలీస్ చంద్రశేఖర్‌రెడ్డి, నర్వలో బంగ్లా లక్ష్మీకాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎమ్మెల్యేను పూలమాలలు, శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో హన్మంతు, కట్ట సురేష్, తాయప్ప, కృష్ణారెడ్డి, చెన్నయ్యసాగర్, శరణప్ప, నీరజ్ పాల్గొన్నారు.

అలరించిన మెగా క్రిస్మస్ వేడుకలు



స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లా కేంద్రంలోని ఎంబీసీ మైదానంలో మహబూబ్‌నగర్ పాస్టర్స్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో సోమవారం రాత్రి ఏర్పాటు చేసిన మెగా క్రిస్మస్ వేడుకలు అలరించాయి. ఈ సందర్భంగా పాస్టర్లు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం క్రిస్మస్ వేడుకలకు గుర్తుగా క్రైస్తవ సోదరులు కొవ్వొత్తులను వెలిగించి ప్రదర్శించారు. హైదరాబాద్‌కు చెందిన ఇమ్మాన్యుయేల్ మినిస్ట్రిస్ అధినేత రెవరెండ్ జెర్మియా క్రీస్తు సందేశం ఇచ్చారు. క్రీస్తు చూపించిన మార్గంలో నడవాలని పిలుపునిచ్చారు. బైబిల్‌లోని పలు ఘట్టాలను చదివి వినిపించారు. వివిధ చర్చీల సంఘాల వారు భక్తిగీతాలు ఆలపించారు. వేడుకల్లో ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. పాస్టర్లతో కలిసి కేక్ కట్ చేశారు. ఎంబీ చర్చి చైర్మన్ ఎస్.వరప్రసాద్, డాక్టర్ శామ్యుల్, డాక్టర్ రజనికాంత్, డాక్టర్ విజయ్‌కాంత్, సుందర్‌పాల్, బీఎస్.పరంజ్యోతి, కోశాధికారి యేసుపాదం తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థులు

కోస్గి: మండలంలోని సర్జఖాన్‌పేట జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన 9వ తరగతి విద్యార్థులు సంధ్య, సంధ్యారాణి జిల్లా స్థాయి పోటీల్లో ప్రతిభ చూపి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికై నట్లు వ్యాయామ ఉపాధ్యాయుడు నర్సిములు తెలిపారు. ఉమ్మడి జిల్లా స్థాయిలో పాలమూరులో నిర్వహించిన బాలికల అండర్-14 విభాగంలో రగ్బీ పోటీల్లో ఇరువురు విద్యార్థినులు మొదటి స్థానంలో నిలిచారు. వీరు మేడ్చల్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొననున్నారు. ఈ మేరకు వారిని సోమవారం హెచ్‌ఎం కృష్ణమూర్తి, పీఈటీ నర్సిములు, ఉపాధ్యాయ బృందం అభినందించారు.



పోటీలకు ఎంపికైన సంధ్య, సంధ్యారాణి

అసంపూర్తి పనులపై ఆరా

దేవరకద్ర: నియోజకవర్గ కేంద్రంలోని క్యాంపు కార్యాలయంలో సోమవారం వివిధ శాఖల అధికారులతో ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి సమీక్షా సమావేశం నిర్వహించారు. అసంపూర్తిగా ఉన్న పనుల గురించి, అలాగే కొత్తగా చేపట్టవలసిన పనులపై ఆరా తీశారు. నియోజకవర్గాన్ని అన్ని విధాల అభివృద్ధి పరచడానికి అధికారులు పూర్తిగా సహకరించాలని కోరారు. ప్రజల సమస్యలను పరిష్కరించడానికి అందరు ముందుండాలని సూచించారు. సాగునీటి, తాగునీటి అవసరాలపై ఉన్న వనరులపై సమీక్ష చేపట్టారు. పంచాయతీరాజ్, ఆర్‌అండ్‌బీ, మిషన్ భగీరథ, నీటి పారుదల, వైద్య ఆరోగ్య, విద్య ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి

మిషన్ భగీరథ పైపులైన్‌కు మరమ్మతు

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: కొన్ని నెలలుగా స్థానిక బంగ్లగేరి చౌరస్తా సమీపంలోని నడిరోడ్డుపై రెండు చోట్ల మిషన్ భగీరథ పథకం పైపులైన్‌కు లీకేజీ ఏర్పడింది. దీంతో తాగునీరు వదిలినప్పుడు ఈ రహదారిపై వృథాగా పారుతుండటంతో వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ విషయమై ఇటీవల మున్సిపల్ అధికారులకు స్థానికులు ఫిర్యాదు చేశారు. దీనికి స్పందించిన వారు సోమవారం ఆ రెండు చోట్ల మరమ్మతు చేయించడంతో సమస్య ఎట్టకేలకు పరిష్కారమైంది.



మరమ్మతు చేస్తున్న సిబ్బంది

'ఉన్నతి' ద్వారా సామర్థ్యాల పరిశీలన

నర్వ: విద్యార్థుల్లో సామర్థ్యాల పెంపే లక్ష్యంగా చేపట్టిన ఉన్నతి కార్యక్రమం అమలు తీరు తెన్నులను సోమవారం ఎఫ్‌ఎల్‌ఎన్ సీపీడీలు ప్రకాష్, మురళీధర్‌రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా నర్వ, పెద్దకడ్మూర్, సీపూర్, కొత్తపల్లి ప్రాథమిక పాఠశాలలు, యూపీఎస్ లంకాల్ పాఠశాలలను వారు తనిఖీ చేశారు. ప్రతి తరగతిలో విద్యార్థులు సాధించిన సామర్థ్యాలను విద్యార్థుల వారీగా అడిగి తెలుసుకున్నారు. ఎఫ్‌ఎల్‌ఎన్‌లో గణితం, తెలుగు ఉన్నతి అంశాలను వారు పరిశీలించారు. పాఠశాలల హెచ్‌ఎంలను విద్యార్థుల ప్రగతిపై నివేదిక తీసుకున్నారు. ఎంఎస్‌ఓ రాజేష్, కాంప్లెక్స్ హెచ్‌ఎం నర్సింహులు, హెచ్‌ఎంలు శివశంకర్, మణెమ్మ, మల్లేష్, ప్రదీప్ తదితరులున్నారు.



పెద్దకడ్మూర్ పాఠశాలలో విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలిస్తున్న ఎఫ్‌ఎల్‌ఎన్ సీపీడీ

వారాంతంలో విద్యార్థులకు పరీక్షలు నిర్వహించాలి



నిడుగుర్తి పాఠశాలలో విద్యార్థులతో మాట్లాడుతున్న ఎంఈఓ

ఊట్కూరు: పాఠశాలల్లో వారాంతంలో విద్యార్థులకు పరీక్షలు నిర్వహించాలని ఎంఈఓ వెంకటయ్య ఉపాధ్యాయులకు సూచించారు. సోమవారం మండలంలోని నిడుగుర్తి ప్రాథమికోన్నత పాఠశాలను సందర్శించారు. తరగతి గదిలో విద్యార్థుల స్థాయిని పరీక్షించి సంతృప్తి వ్యక్తం చేశారు. పాఠ్య పుస్తకాలను, వర్క్‌షీట్లను సమర్థవంతంగా కొనసాగించాలన్నారు. వారాంతంలో విద్యార్థులకు పరీక్షలు నిర్వహించి ఎప్పటికప్పుడు మూల్యాంకనం చేయాలని సూచించారు. పాఠశాలల్లో విద్యార్థుల హాజరుశాతం పెంచేవిధంగా తల్లిదండ్రులకు సూచనలు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం లక్ష్మారెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అధికారులు సమయపాలన పాటించాలి

ఊట్కూరు: రెవెన్యూ సిబ్బంది సమయపాలన పాటించాలని తహసీల్దార్ శివశ్రీనివాస్ సూచించారు. సోమవారం రెవెన్యూ సిబ్బందితో సమావేశంలో నిర్వహించారు. పెండింగ్‌లో ఉన్న కల్యాణలక్ష్మి, మ్యుటేషన్ల వివరాలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు అందించే ధ్రువపత్రాలతో జాప్యం చేయరాదన్నారు. ఏదైనా భూ సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని తెలిపారు. రెవెన్యూ సిబ్బంది సమయపాలన పాటించి కార్యాలయానికి వచ్చే ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. సమావేశంలో డిప్యూటీ తహసీల్దార్ సురేష్, సూపరింటెండెంట్ షాహీన్ సుల్తానా, రాఘవేందర్‌రెడ్డి, వెంకటేష్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న తహసీల్దార్ శివశ్రీనివాస్

హరితహారం మొక్కలకు నిప్పు



వర్క్యూర్ సమీపంలో తగలబడిన హరితహారం మొక్కలు

మాగనూర్: పర్యావరణ పరిరక్షణ కోసం ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన హరితహారం లక్ష్యం తగలబడిపోతుంది. మండలంలోని వర్క్యూర్ శివారులో పంట పైర్లను తగలబెట్టడంతో పక్కన ఉన్న చెట్లకు కూడా నిప్పు తగిలి అక్కడ చెట్లు కాలిపోతున్నాయి. రోడ్లపై పంట దిగుబడులు ఆరబెట్టడం, నూర్పిళ్లు అక్కడనే చేయడంతో పంట దిగుబడుల వ్యర్థాలు అధికంగా వస్తున్నాయి. వాటిని కొందరు రోడ్డు పక్కనే, కొందరు రోడ్లపైనే తగుల పెడుతున్నారు. దీంతో సమీపంలో ఉండే చెట్లు తగలబడి పోతున్నాయి. అధికారులు స్పందించి ఇలాంటివి కాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకుని హరితహారం మొక్కలను రక్షించాలని ప్రజలు కోరుతున్నారు.

ఘనంగా భారతీయ భాషా మహోత్సవం



మాతృభాషలో సంతకాలు చేస్తున్న విద్యార్థులు

నారాయణపేట రూరల్: పట్టణంలోని శ్రీసరస్వతి శిశుమందిర్ ఉన్నత పాఠశాలలో సోమవారం భాషా దివస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు, ఉపాధ్యాయులతో మాతృభాషలో సంతకాల సేకరణ చేపట్టారు. చిన్నారులు తెలుగు, మరాఠి, హిందీ, కన్నడ, కత్రి, సంస్కృతం, లంబాడ భాషలో సంతాకాలు చేశారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో కవి రామ్మోహన్‌రావు కులకర్ణి మాట్లాడుతూ సుబ్రమణ్య భారతి అందరికి ఆదర్శనీయులని, 29 భారతీయ భాషలతో పాటు మరో మూడు ఇతర దేశాల భాషలను నేర్చుకున్న బహుభాషా కోవిదుడన్నారు.

కరాటే విద్యార్థులకు అభినందనలు



పతకాలు సాధించిన విద్యార్థులతో మోసీన్ తదితరులు

మహబూబ్‌నగర్ క్రీడలు: మక్తల్ పట్టణంలో ఆదివారం జరిగిన జాతీయస్థాయి కరాటే చాంపియన్‌షిప్‌లో జిల్లా కేంద్రానికి చెందిన డ్రాగన్ షోటోకాన్ కరాటేడూ స్పోర్ట్స్ విద్యార్థులు పతకాలు సాధించినట్లు షోటోకాన్ అర్బన్ అధ్యక్షుడు మాస్టర్ ఎస్‌కే.మోసీన్ తెలిపారు. విద్యార్థులను సోమవారం జిల్లా కేంద్రంలోని ఎంవీఎస్ డిగ్రీ కళాశాల మైదానంలో అభినందించారు. డ్రాగన్ షోటోకాన్ దూ స్పోర్ట్స్ ఫౌండర్ సాలం బిన్ ఉమర్, చీఫ్ ఎగ్జామినర్ అమ్రేష్, నిలేష్, రమేష్‌నాయక్, మధువీర్, రామచంద్ర, వెంకటేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జాధరావ్‌పల్లిలో పడిపూజ

మద్దూరు: మండలంలోని జాధరావ్‌పల్లిలోని భీంసేన్ స్వగృహంలో పడిపూజ కార్యక్రమంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. గణపతి, సుబ్రమణ్యస్వామి అష్టోత్తరాలు, అంగపూజ నిర్వహించారు. అనంతరం అయ్యప్పకు పంచామృతాభిషేకం, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం పడి వెలిగించారు. ఈ సందర్భంగా అయ్యప్ప భక్తులు ఆడిపాడారు.